క్లుప్తంగా

జీవోలను సవరించి టీచర్లకు న్యాయం చేయాలి

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 11, 12ను సవరించి బీఈడీ అర్హత ఉన్న ఉపాధ్యాయులకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం పీఆర్‌టీయూ టీఎస్ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.... సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. ఆదర్శ పాఠశాల బదిలీలకు అడ్డుగా ఉన్న కోర్టు కేసులను సత్వరం పరిష్కరించాలని, సమగ్ర శిక్ష సిబ్బందికి షెడ్యూల్ ప్రకటించాలన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను వెంటనే ఇప్పించి అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు జైపాల్‌రెడ్డి, పాకల ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కొల్లూరి తిరుపతిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

మద్యం షాపులు వేరేచోటుకి తరలించాలి

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ కూడలిని అనుకొని పాపారావు బొంద స్థలంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం సంఘటనపై స్థానిక కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య విచారం వ్యక్తం చేశారు. చిరువ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు, స్థలాన్ని ఆనుకొని మద్యం దుకాణాలున్నాయని, అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు సాగుతున్నాయని, నివాసితులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాత్రిపూట ప్రశాంత వాతావరణం దెబ్బ తింటుందని, మద్యం షాపులను వేరే చోటికి మార్చాలన్నారు. అగ్ని ప్రమాదంతో చిరువ్యాపారులు తీవ్రంగా నష్టపోయిన దృష్ట్యా పోలీసు, ఎక్సైజ్ అధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

సైదాపూర్: మండలంలోని ఆకునూర్‌లో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపెల్లి కిష్టయ్య, సీనియర్ నాయకులు మద్దూరి రవిందర్‌రెడ్డి, రాయిశెట్టి చంద్రయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక

చొప్పదండి: పట్టణంలోని వీణాధరి ఉన్నత పాఠశాలకు చెందిన హర్షవర్ధన్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించాడు. విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ అభినందించారు. విద్యార్థులు లక్ష్యం ఏర్పరుచుకొని ప్రణాళికాతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీత కార్మికుల హర్షం

చొప్పదండి: గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా కాటమయ్య రక్షణ కవచాలను ఉచితంగా ప్రభుత్వం అందజేయడం పట్ల జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తాల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరువతో కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ ప్రారంభించారని, భవిష్యత్‌లో గీత కార్మికుల ప్రమాదల నివారణకు ఉపయోగపడుతుందని, గతంలో యాభై ఏళ్లకే గీత కార్మికులకు పింఛన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

హుజూరాబాద్‌రూరల్: రుణమాఫీకి అర్హులైన రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు సొల్లు బాబు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతుందనడానికి రుణమాఫీ నిదర్శనమన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

గన్నేరువరం: ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏలోకి మార్చాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ భిక్షపతికి మండలంలోని ముదిరాజ్‌లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రంగనవేణి లక్ష్మీనర్సు, ఉపాధ్యక్షుడు బోయిని మల్లయ్య, ముఖ్య సలహాదారులు పెద్ద మల్లయ్య, బోయిని కుమార్, మధు, దుర్మిట్ల రాజు, రంగనవేని సతీష్, నర్సయ్య, కులసంఘం సభ్యులు పాల్గొన్నారు.
సైదాపూర్: రాష్ట్రంలోని ముదిరాజుల సమస్యలు పరిష్కరించాలని ముదిరాజు మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి గీకురు రవీందర్, ఉపాధ్యక్షుడు రాయిశెట్టి చంద్రయ్య తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చాలని కోరారు. ముదిరాజు మహాసభ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు పవన్, అశోక్, అజయ్, సారయ్య, సమ్మయ్య, రాములు, సారయ్య, శ్రీనాథ్ ఉన్నారు.

అటు పోరాదు.. ఇటు రారాదు

- చినుకు పడితే చిత్తడిగా కస్తూరిబా, మహాత్మాజ్యోతిబాపూలే స్కూల్ రోడ్డు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- రోడ్డును పరిశీలించిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- త్వరలో రోడ్డు నిర్మాణానికి హామీ


గుంతలతో బురదమయంగా మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాల రోడ్డు

తిమ్మాపూర్: రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని రోడ్లు చిత్తడిగా మారాయి. చిన్నపాటి వర్షాలకే నడవడానికి వీల్లేకుండా తయారయ్యాయి. మహాత్మా జ్యోతి బాపూలే, కేజీబీవీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండటంతో టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధ్యాయులు ప్రైవేటు వాహనాలు అద్దెకు తీసుకొని వెళ్తున్నారు. అరకిలోమీటర్ దూరం లేకపోయినా ఆటోలో వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది బురదలోనే నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నారు.

నిధులు మంజూరైనా నిర్మించని వైనం

గత ప్రభుత్వ హయంలో పాఠశాలలకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ నుంచి రూ.60లక్షలు మంజూరయ్యాయి. అయినా ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. నిధులు వెనక్కి వెళ్లడంతో పంచాయతీరాజ్ అధికారులు అత్యవసర రోడ్డు అని ఎమ్మెల్యే కవ్వంపల్లి దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు తిరిగి మంజూరయ్యేలా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే..

వర్షాలకు మట్టిరోడ్డు బురదమయంగా అవుతుందని ఉపాధ్యాయులు ఇటీవల ఎమ్మెల్యే కవ్వంపల్లి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మంగళవారం రోడ్డును పరిశీలించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. త్వరలో సీసీరోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. పది, ఇంటర్ ఫలితాల్లో నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలల నుంచి రాష్ట్రస్థాయి ర్యాంకులు విద్యార్థులకు, కృషి చేసిన క్లాస్ టీచర్లకు సొంతంగా లక్ష రూపాయల నగదు అందజేస్తానని ప్రకటించారు. వెంట పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు ఎస్ఎల్ గౌడ్, రమేశ్,రాము,తిరుపతిరెడ్డి,శీను తదితరులున్నారు.

పోలీసుల చేయూత

హుజూరాబాద్: పట్టణంలోని పాపారావు బొంద స్థలంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన చిరువ్యాపారులకు హుజూరాబాద్ పోలీసులు అండగా నిలిచారు. ఏసీపీ శ్రీనివాస్‌జీ పదిమందికి రూ.3వేల చొప్పున అందించారు. సీఐలు బొల్లం రమేశ్, వి.రవి, ఎస్సైలు పాల్గొన్నారు.


నగదు అందిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ, సీఐ, ఎస్సైలు

నియామకం


అనిల్‌తో సంఘం నాయకులు

గంగాధర: మున్నూరుకాపు సంఘం గంగాధర మండల అధ్యక్షుడిగా మండలంలోని గోపాల్‌రావుపల్లి గ్రామానికి చెందిన కోల అనిల్‌ను సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ నియమించాడు. నూతన అధ్యక్షుడిని మంగళవారం గ్రామ మున్నూరుకాపు సంఘం నాయకులు సన్మానించారు. ఈసందర్భంగా అనిల్ మాట్లాడుతూ... మండలంలోని అన్ని గ్రామాలలో ముకాస(మున్నూరు కాపు సంఘం) కమిటీలు వేయడంతో పాటు విద్యార్థుల సమస్యలు, బీసీ రిజర్వేషన్లపై పోరాటం చేస్తామన్నాడు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, పురుషోత్తం, ఉప్పు ప్రశాంత్, రాసూరి సంజీవ్, చిందం మహేశ్, తిరుపతి తదితరలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఇల్లందకుంట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ ఎ.మోహన్‌రెడ్డి అన్నారు. ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని వాగొడ్డు రామన్నపల్లి గ్రామంలో డాక్టర్ తులసిదాస్ ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. నీరు, గాలి ద్వారా వచ్చే వివిధ వ్యాధులు, లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఏఎన్ఎం అరుణ, ఆశా, పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల (బాలురు), మైనార్టీ గురుకుల (బాలికల) పాఠశాలలో హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చందు ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందుల పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, డ్రై డే, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యులు సంధ్యారాణి, మహోన్నత, సాజిద్, కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు కట్టకు మరమ్మతు

సైదాపూర్: మండలంలోని వెన్కెపల్లి తుమ్మల చెరువు కట్టకు మంగళవారం అధికారులు జేసీబీతో మరమ్మతులు చేయించారు. సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు తుమ్మల చెరువు కట్ట కాలువ కుంగడంతో గండి ఏర్పడింది. విషయాన్ని రైతులు తహసీల్దార్ మంజులకు విన్నవించగా ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మరమ్మతు పనులు చేయించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు జేసీబీతో కుంగిన చోట మట్టిపోయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఆర్ఐ శరత్‌కుమార్, పంచాయతీకార్యదర్శి తిరుమల, కారోబార్ గడ్డం రమేశ్, రైతులు ఉన్నారు.

ఘనంగా ఐసీఏఆర్ వ్యవస్థాపక దినోత్సవం


ప్రోగ్రాం వీక్షిస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

జమ్మికుంట: భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) 96వ వ్యవస్థాపక, సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాన్ని పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో (కేవీకే) శాస్త్రవేత్తలు, విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. కేవీకే హెడ్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యవసాయ పరిశోధన సంస్థల్లో ఐసీఏఆర్ ఒకటని, 2020–24 వరకు తృణధాన్యాలు, నూనె గింజలు, గడ్డిజాతి పంటలు, చెరుకుతో సహా మొత్తం 56 పంటల్లో 323 రకాలను విడుదల చేశారని వివరించారు. ఉద్యాన పంట కోసం 1071 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనాలను ఉత్పత్తి చేసిందని, ఐసీఏఆర్‌లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ సంబంధిత సీట్లను పదిశాతం పెంచారని, ఐసీఏఆర్ పరీక్ష ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 9,651 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని తెలిపారు. దేశ వ్యాప్తంగా 731 కృషి విజ్ఞాన కేంద్రాల సహకారంతో రైతులకు వ్యవసాయ, అనసుంబంధ రంగాల్లో శాస్త్రీయ సలహాలు, సూచనలు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

లింకురోడ్డు ఆక్రమించారని ఫిర్యాదు


కబ్జాకు గురైన రోడ్డు

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లి నుంచి నగునూరు గ్రామానికి వెళ్లే లింకురోడ్డును ఇద్దరు రైతులు ఆక్రమించారని, రోడ్డును పునరుద్ధరించాలని కోరుతూ గ్రామంలోని పలువురు రైతులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. 24 ఫీట్ల లింకురోడ్డుకు గతంలో రూ.12.50 లక్షలు వెచ్చించి మరమ్మతు చేసి కల్వర్టు నిర్మించారని తెలిపారు. రెండు గ్రామాల మధ్య లింకురోడ్డును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రుణమాఫీ జీవోను సవరించాలి

జమ్మికుంట: రేషన్‌కార్డు ఆధారంగా రుణమాఫీ వర్తింపజేయడం వల్ల కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడతారని, రైతులకు ప్రయోజనకరంగా ప్రభుత్వం రుణమాఫీ జీవోను సవరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాము అన్నారు. పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయ కోసం రుణం తీసుకున్న సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు స్వయం సహాయక బృందాలు, జాయింట్ లయబిలిటీ, రైతుమిత్ర, కౌలుదారులకు లోన్ ఎలిజబిలిటీ కార్డు ఉన్నవారికి వర్తించదని ప్రకటించడం బాధాకరమన్నారు. పదేళ్లుగా బ్యాంకులు రుణాలు ఇవ్వకపోడంవల్ల అసలు కంటే వడ్డీలు పెరిగాయని, రుణం చెల్లించే పరిస్థితిలో రైతులు లేరన్నారు. రీషెడ్యూల్ చేసి రుణాలు మిత్తితో రూ.రెండు లక్షలపై చీలుకు ఉందని, రుణం చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందనే నిబంధనలు సరికాదన్నారు. రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులు ఉన్నప్పటికీ బ్యాంకులు 43 లక్షల మందికి మాత్రమే అప్పులిచ్చాయని, పీఎం కిసాన్ పథకం కింద 31 లక్షల మందికి ఇవ్వగా ఆ డేటాను వర్తింపజేయడం వల్ల అర్హత కలిగిన రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు.

రెండు తులాల బంగారం చోరీ

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన ఆకుల భారతమ్మ ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చొరబడి రెండు తులాల బంగారం నగ ఎత్తుకెళారని మానకొండూర్ సీఐ మాదాసు రాజ్‌కుమార్ తెలిపారు. భారతమ్మ గత ఐదు రోజుల క్రితం కనపర్తి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి మంగళవారం ఇంటికి రాగా తాళం, బీరువా పగులగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని నిరసన



గడ్డి తొలగిస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

గంగాధర: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేయగా బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఉన్నత చదువులకు దూర ప్రాంతాలకు వెళ్లలేక చదువు మానేయాల్సి వస్తుందని విద్యార్థులు వాపోయారు. ఎన్నికలకు ముందు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామనడం నాయకులకు పరిపాటిగా మారిందని, ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు నాయకులు వినయ్‌సాగర్, కోల అశోక్, తాళ్ల శేఖర్, దాసరి ఆంజనేయులు, సర్వు శ్రీనివాస్, ఆకుల మనోహర్, మహేశ్, తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జీవితం నాశనం చేసుకోవద్దు

చిగురుమామిడి: ఉన్నత చదువులు చదివిన యువత ప్రజాసేవకు రాజకీయాల్లోకి రావాలని మండలంలోని ముదిమాణిక్యం తాజా మాజీ ఉపసర్పంచ్ ముంజ శిరీషప్రకాశ్ కోరారు. మంగళవారం గ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. చదువుకున్న వారితో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత చెడువ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, నేరాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు మార్గాలను వీడి ప్రజలకుసేవచేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో పలువురు మాజీవార్డు సభ్యులు పాల్గొన్నారు.

• పోస్టర్ ఆవిష్కరణ



హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో హుజూరాబాద్ మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల రాజుగౌడ్ మాట్లాడారు. 26 27 28వ తేదీల్లో హైదరాబాద్‌లో ఫొటో ఎక్స్‌పో జరగనుందని, కొత్త మెలకువలు నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సిరి రవి, రాష్ట్ర గౌరవ సలహాదారు కేదార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మ చెందు, మండల ప్రధాన కార్యదర్శి ఎండీ యాకుబ్ అలీ, కోశాధికారి ప్రసాద్, ఉపాధ్యక్షుడు రాజేశ్, శ్రీశైలం ఉన్నారు.

సైన్స్‌ల్యాబ్ భవన నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పీఎంశ్రీ కింద రూ.13.50 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సైన్స్‌ల్యాబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం వనమహోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వన మహోత్సవం చేపట్టిందని, గత ప్రభుత్వం హరితహారంతో పేరుతో ఇష్టం వచ్చిన మొక్కలు నాటుతూ డబ్బులు దుర్వినియోగం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భవిష్యత్ తరాలకు ఏ మొక్కలు అవసరమో వాటినే నాటించాలని సూచించిందన్నారు. పండ్లు, నీడనిచ్చే మంచి మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రచారీ, నాయకులు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపల్లి సంపత్‌గౌడ్, సాయిరి దేవయ్య, గసికంటి సంపత్, రామిడి తిరుపతి, రామిడి తిరుమల్‌రెడ్డి, మడుపు ప్రేమ్‌కుమార్, రేమడి శ్రీనివాస్‌రెడ్డి, మీస సత్యనారాయణ, డీఈ విన్సెంట్‌రావు, ఏఈ ప్రదీప్, కనకం కుమార్, రామగిరి సంతోష్, బండెల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే

మానకొండూర్‌కు చెందిన అక్షయ బాసర ఐఐఐటీలో సీటు సాధించగా ఎమ్మెల్యే విద్యార్థినిని సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉన్నత చదువులు చదవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో గసిగంటి సంపత్, గోశెట్టి సత్యనారాయణ, బండి మల్లేశం, కుందేళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

చిగురుమామిడి: పేదల మనుగడ, భవిష్యత్ కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి అన్నారు. మండల కేంద్రంలోని కామ్రేడ్ ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో మంగళవారం సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పాలక పక్షాలను నిలదీసే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని, రైతులు, కూలీలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే సీపీఐ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. అనంతరం చిగురుమామిడి సీపీఐ గ్రామశాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అల్లేపు జంపయ్య, సహాయ కార్యదర్శులుగా అనుమోజు జనార్దన్, రావుల మోహన్‌తోపాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నామని స్వామి తెలిపారు. ఈ సమావేశంలో మండల సీపీఐ కార్యదర్శి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి, ముద్రకోల రాజయ్య, మండల సహాయకార్యదర్శి అందె చిన్నస్వామి, మహిళా సమాఖ్య మండల బాధ్యులు రాకం అంజవ్వ, జిల్లా నాయకులు తేరాల సత్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి


తిమ్మాపూర్: ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్స్, పిల్లలు

చొప్పదండి: మండలంలోని కొలిమికుంటలో మంగళవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ఏఎన్ఎం సుమలత, అంగన్‌వాడీ టీచర్ లావణ్య, జి.రమ, తదితరులు పాల్గొన్నారు.
గన్నేరువరం: మండలంలోని హన్మాజిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ప్రీ స్కూల్ సిలబస్, మెటీరియల్ రోజు ఆటల కార్యక్రమాలు, అసైన్‌మెంట్ కార్డుల గూర్చి పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇశ్రత్ సుల్తానా, టీచర్స్ హేమలత, నిర్మల సునీత, ఆశా కార్యకర్త రజీయా బేగం పాల్గొన్నారు.
సైదాపూర్: మండలంలోని గర్రెపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆయా నర్సమ్మ, పాల్గొన్నారు.
తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో ఏఎల్ఎంఎస్‌సీ మీటింగ్ నిర్వహించారు. పిల్లలు, తల్లిదండ్రులతో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. రెండున్నరేళ్లు నిండిన వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందిస్తామని తెలిపారు. ఏసీడీపీవో అరవింద సూపర్వైజర్ శ్రీలత, వీవోఏలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, కిశోర బాలికలు ఉన్నారు.

అదృశ్యమైన వివాహిత తల్లిదండ్రులకు అప్పగింత


రమ్యను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

జమ్మికుంట: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని విఠల్‌నగర్‌కు చెందిన అంబాల రమ్య అదృశ్యమైనట్లు భర్త అన్వేశ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహిళ ఆచూకీ తెలియడంతో ఏఎస్ఐ దామోదర్ సమక్షంలో మంగళవారం పోలీసులు రమ్యను తల్లిదండ్రులకు అప్పగించారు. జమ్మికుంటకు వైద్య పరీక్షలకు వచ్చిన వివాహిత వరంగల్‌లోని మేనమామ రాజు ఇంటివెళ్లింది. మేనమామ జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చాడు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ద్వారకపేట గ్రామానికి చెందిన రమ్య తల్లిదండ్రులు పంగ రాజు,స్వరూపను పిలిపించి అప్పగించినట్లు ఏఎస్ఐ తెలిపారు.


జమ్మికుంట: శాకాంబరి అవతారంతో అమ్మవారు

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు


చొప్పదండి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మంగళవారం శాకాంబరి (కూరగాయాలు) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు రామచందర్‌రావు మాట్లాడారు. ఆషాఢ మాసంలో ఏకాదశి ముందు దశమి రోజు అమ్మవారిని శాకాంబరి అవతారంలో అలంకరించగా మహిళలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. అనంతరం మహిళలు లలితా పారాయణం, గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవిమాత ఆలయ ధర్మకర్తలు ముక్క జితేందర్ గుప్తా దంపతులు, క్లబ్ అధ్యక్షురాలు మురికి పూర్ణిమ, వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు

చొప్పదండి: పట్టణంలోని రాజశ్యామలా పీఠంలో నిర్వహించిన వారాహి నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. పీఠం వ్యవస్థాపకులు పాలోఝు చరణాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశా రు. చివరిరోజు మూలమంత్ర అనుష్టానం, వారాహి విద్యా పారాయణం, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేష్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com